ప్రజాశక్తి

బుధవారం 5 ఏప్రిల్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

బడా సంస్థల బకాయిలు

లేబర్ సెస్సు, ఆస్తి పన్ను చెల్లింపుల్లో మీనమేషాలు - రాజధానిలో కార్పొరేట్ యూనివర్సిటీలపై కలెక్టర్ కన్నెర్ర

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

విద్యార్థుల నుంచి ఏడాదికి రూ.3 నుంచి రూ.4 లక్షలు వసూలు చేస్తున్న రాజధాని ప్రాంతంలోని కార్పొరేట్ విద్యా సంస్థలు పన్నుల చెల్లింపుల్లో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నాయి. ఆయా సంస్థల నుంచి మామూళ్లు తీసుకుంటున్న యంత్రాంగం బకాయిలు వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. జిల్లా కలెక్టర్ వత్తిడి చేసినా పన్నుల వసూలుకు పంచాయతీ, కార్మిక శాఖ అధికారులు తగిన శ్రద్ధ పెట్టడం లేదు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డికి 'స్పందన'లో ప్రతి సోమవారం ఫిర్యాదులు అందుతున్నాయి. కార్పొరేట్ సంస్థల నుంచి బకాయిలు ఎందుకు వసూలు చేయడంలేదని జిల్లా పంచాయతీ అధికారులను కలెక్టర్ నిలదీసినా పంచాయతీ, కార్మికశాఖ అధికారుల నుంచి స్పందన రావడం లేదు. 2018 నుంచి 2023 మార్చి వరకు ఉన్న బకాయిలు వసూలులో అధికారులు జిల్లా కలెక్టర్‌కు సైతం తప్పుడు నివేదికలు ఇవ్వడంతో గుంటూరుకు చెందిన అప్పసాని చంద్రశేఖర్ ఈనెల 3వ తేదీన మరోసారి ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజధాని గ్రామాల్లోని విట్, అమృత్, ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలు 2017-18లో ఏర్పాటయ్యాయి. 2018 నుంచి పన్నుల బకాయిలున్నాయి. అప్పటి టిడిపి ప్రభుత్వం ఈ బకాయిలు గురించి పట్టించుకోలేదు. తరువాత ఈ సంస్థల వారు దిగువ స్థాయి సిబ్బందిని మ్యానేజ్ చేసుకుని పన్నులు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఏడాదికి రూ.60 లక్షల చొప్పున రూ.3 కోట్ల బకాయికి గాను ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ రూ.1.68 కోట్లు చెలించింది. విట్ యూనివర్సిటీ మూడు కోట్లకు గాను రూ.కోటి 10 లక్షలు చెల్లించింది. లేబర్ సెస్సును భవన నిర్మాణం పూర్తి అయ్యేలోగా చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో చెల్లించలేదు. విట్ యూనివర్సిటీ లేబర్ సెస్సు ఇంకా రూ.50 లక్షలు బకాయి ఉండగా ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ రూ.కోటి వరకు బకాయి ఉన్నట్టు కార్మికశాఖ అధికారులు ఆలస్యంగా గుర్తించారు. అమృత్ యూనివర్సిటీ ఆస్తి పన్ను రూ.50 లక్షలు, లేబర్ సెస్సు రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఈ మూడు యూనివర్సిటీల ఏర్పాటు సమయంలో గత ప్రభుత్వం అనేక రాయితీలు ఇచ్చింది. దీంతో వారు ఈ పన్నులుకూడా చెల్లించాల్సిన అవసరం లేదని భావించారని చెబుతున్నారు. అందువల్ల కొంత జాప్యం జరిగిందని అధికారులు అంటున్నారు.

అయితే ప్రస్తుత ప్రభుత్వం ఎటువంటి మినహాయింపూ ఇవ్వకపోవడంతో యథాతథంగా 2018 నుంచి 2023 వరకు ఇంటి పన్నులు, కార్మిక శాఖకు లేబర్ సెస్సు చెల్లించాలని

▶ 2లో

మీ కృషికి మా సహకారం..

- పల్నాడు జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలి
- జిల్లా తొలి ఆవిర్భావ దినోత్సవాల్లో మంత్రులు
- మరిన్ని వైవిధ్యభరిత కార్యక్రమాలతో ముందుకెళ్తామన్న కలెక్టర్

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా మొదటి వార్షికోత్సవం కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, జెడ్‌పి చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టరేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన పైలాన్, జిల్లా లోగో, కార్యాలయ నామ ఫలకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ఫుడ్‌కోర్టును ప్రారంభించారు. నవోదయంలో ద్వారా ఎంపికైన వారికి వాహనాలను ఇన్‌ఛార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరావు ద్వారా అందించారు. ఈ సందర్భంగా మంత్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యం ఉన్న, వెనకబడిన పల్నాడు ప్రాంత అభివృద్ధి జిల్లా కలెక్టర్ చేస్తున్న కృషిని అభినందించారు. అధికారుల కృషికి మంత్రులు, ఎమ్మెల్యేల సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పల్నాడు జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు అందరం కష్టపడి పని చేద్దామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పల్నాడు జిల్లా సమగ్రాభివృద్ధికి అందరం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లా అయినా బాలారిష్టాలన్నీ దాటుకొని సిబ్బంది అందరూ బాగా పని చేశారన్నారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ నూతన

▶ 2లో

రాజధాని రైతుల ప్లాట్ల రిజిస్ట్రేషన్

మరోసారి ప్రకటించిన సిఆర్‌డిఎ కమిషనర్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల పెండింగ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 63,462 ప్లాట్లలో (నివాస, వాణిజ్య) గతనెల 22వ తేదీ నాటికి 45,524 ప్లాట్లకు సంబందించిన రిజిస్ట్రేషన్‌లు పూర్తయ్యాయని ప్రకటనలో వెల్లడించారు. ఇంకా 20,938 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారని తెలిపారు. కృష్ణాయపాలెం, నవులూరు 1, 2, కురగల్లు1, 2 (నీరుకొండ), నిడమర్రు 1,2 కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.సాయిబాబు, ఉండవల్లి, పెనుమాక, లింగాయపాలెం, ఉద్దండరాయునిపాలెం, మల్కాపురం, గన్నవరానికి వి.శైలజ, అబ్బురాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, పిచ్చుకలపాలెం, నెక్కల్లు, నేలపాడు, తుళ్లూరు 1, 2, అనంతవరానికి ఎస్.విజయలక్ష్మి, ఐనవోలు, శాఖమూరు, వెలగపూడి, వెంకటపాలెం, మందడం 1, 2కు సాయి శ్రీనివాస నాయక్, రాయపూడి 1, 2, కొండమరాజుపాలేనికి కె.స్వర్ణమేరిని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్‌లో ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే వారిపై సిఆర్‌డిఎ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చుని, రిజిస్ట్రేషన్ సమయంలో భూయజమానులు తన భూమికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్‌లను సమర్పించాలని స్పష్టం చేశారు. రైతులు తక్షణమే తమ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా మూడు నెలల్లోగా రైతులకు ప్లాట్లు ఇవ్వాలని గతేడాది మార్చిలో హైకోర్టు ఆదేశించగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సిఆర్‌డిఎ అధికార్లు ఇప్పటికే రైతులకు నోటీసులు అందజేశారు. అయినా రైతులు రిజిస్ట్రేషన్‌కు ముందుకు రావడంలేదు. దీంతో సిఆర్‌డిఎ అధికారులు మరోసారి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు చర్యలు చేపట్టారు.

ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు

బైపాస్‌ను నిర్మించకుంటే నిరాహారదీక్ష

- గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పల్నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీకి వినతి

ప్రజాశక్తి - నరసరావుపేట

బైపాస్ పనులను త్వరగా పూర్తి చేయకుంటే టోల్‌గేట్ వద్ద నిరాహార దీక్ష చేపడతామని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారికి అనుబంధంగా, పిడుగురాళ్ల పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పదేళ్ల కిందట నిర్మించాల్సిన బైపాస్ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. దీనిపై

▶ 2లో

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ తలసిల రఘురాం

4లో

ఏర్పాట్లపై సమీక్షలో మంత్రి రజిని, ఎమ్మెల్సీ రఘురాం, కలెక్టర్, ఎస్పీ

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం) : 6.26

సహరీ (గురువారం ఉదయం) : 4.43

సభలో మాట్లాడుతున్న విసి. డాక్టర్ రాజశేఖర్

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

ప్రజాశక్తి - ఏఎన్‌యు :వర్సిటీలో బాబూ జగ్జీవన్ రామ్ 115వ జయంత్యుత్సవం బాబూ జగజ్జీవన్ రామ్ చైర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా కీలకోపన్యాసకుడిగా పాల్గొన్న ఎమ్ ఎల్ సి డా. మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. నవ భారత నిర్మాత బాబూ జగజ్జీవన్ రామ్ అని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన దళితుల ఐకాన్ బాబు జగజ్జీవన్ రామ్ అని తెలిపారు. భారత పార్లమెంట్‌లో4 దశాబ్దాలపాటు పార్లమెంటేరియన్‌గా మెలిగిన అజాత శత్రువు బాబూ జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. దేశ ప్రజల చేత 'బాబూజీ' అన్న పిలుపు పొందిన గౌరవం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే దక్కిందనీ అందులో ఒకరు మహాత్మాగాంధీ కాగా, మరొకరు బాబూ జగ్జీవన్ రామ్ అని తెలిపారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్, విశ్వ విద్యాలయ రెక్టార్ పి.వర ప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమనికి విశ్వవిద్యాలయ సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు అధ్యక్షత వహించారు.

బడా సంస్థల బకాయిలు

(మొదటి పేజీ తరువాయి)

పలుమార్లు నోటీసులు జారీ చేశారు. వివిధ పన్నుల రూపంలో మొత్తం రూ.70 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉండగా వీటిల్లో రూ.20 కోట్ల వరకు కార్పొరేట్ సంస్థలు చెల్లించాల్సినవి ఉన్నాయి. గుంటూరులోని కాటూరి మెడికల్ కళాశాల దాదాపు రూ.50 లక్షల వరకు బకాయి ఉండగా వారు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు మూడు విడతలుగా రూ.30 లక్షలు చెల్లించారు. చేబ్రోలులోని కొన్ని స్పిన్నింగ్ మిల్లులు, భారీ పరిశ్రమల నిర్వాహకులు రూ.60 లక్షల వరకు బకాయిలు ఉన్నారు. జిల్లాలోని ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ కళాశాలలకు చెందిన వారు పెద్దఎత్తున బకాయిలు ఉన్నాయి. పల్నాడు జిల్లాలో దాదాపు రూ.10 కోట్ల వరకు బకాయిలు ఉండగా బాపట్ల జిల్లాలో రూ.3 కోట్లు, గుంటూరు జిల్లాలో రూ.7 కోట్ల వరకు బకాయిలున్నాయి.

తాడేపల్లి 13వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజలను దోపిడీ చేస్తున్న వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి మంగళగిరి:రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రజలను అన్ని రకాలుగా దోపిడీ చేస్తుందని టిడిపి మంగళగిరి నియోజకవర్గం ఇంచార్జ్ నందం అబద్దయ్య అన్నారు. మంగళవారం రాత్రి పాత మంగళగిరిలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అబద్దయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కరెంటు చార్జీలు, ఆస్తి పన్ను పెంచారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి. జానకి దేవి, కాంద్రు శ్రీనివాసరావు, గోవాడ దుర్గారావు, షేక్ సుభాని, వాకా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.**తాడేపల్లి :**పట్టణంలోని 13వ వార్డులో మంగళవారం టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఎంఎస్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్న , సన్న కారు రైతులు, చేతి వృత్తిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రకు వస్తున్న స్పందన చూసి చీప్ రాజకీయాలు చేస్తున్నారని టిడిపి నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో 13వ వార్డు అధ్యక్షుడు కాకుమాను కుమార్, రాష్ట్ర బీసీల ఉపాధ్యక్షులు ఒ. రాము, టిడిపి సీనియర్ నాయకులు ఎ.మురళి, పట్టణ మాజీ అధ్యక్షులు ఇట్టా పెంచలయ్య, ఉయ్యాల కోటేశ్వరరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ టు తిరుపతి 'వందేభారత్'

ఫలించిన ఎంపీ శ్రీ కృష్ణదేవరాయుల కృషి

ప్రజాశక్తి - నరసరావుపేట

సికింద్రాబాద్ టు తిరుపతి వయా పిడుగురాళ్ల, గుంటూరు మధ్య వందేభారత్ రైల్‌ను ప్రారంభించాలని ఈ మార్గం ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నదని విన్నవిస్తూ ఈ ఏడాది జనవరి 25న కేంద్ర ప్రభుత్వానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేసిన అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని మంగళవారం నుండి సికింద్రబాద్ టు తిరుపతి మార్గంలో వందేభారత్ రైల్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. ఈ సందర్భంగా రైలు ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా ప్రతిపాదించిన వందేభారత్ రైల్‌ను పల్నాడులో ఉన్న ముఖ్యమైన పిడుగురాళ్ల స్టేషన్‌లో కానీ, నడికుడి స్టేషన్‌లో కానీ ఆపాలని కోరారు. దీంతో పిడురాళ్లలో రైలు ఆగేలా చర్యలు తీసుకోనున్నారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే బోర్డు చైర్మన్ అనిల్ కుమార్ లహోటి, రైల్వే బోర్డు కార్యకలాపాలు, వ్యాపార అభివృద్ధి మెంబర్ జయవర్మ శిన్హా కు విడివిడిగా లేఖలు రాసారు. ఈ రెండు స్టేషన్లలో ఎక్కడో ఒక చోట వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్టాప్‌ను జోడించడం వల్ల కొత్త పల్నాడు జిల్లాలో మరింత పర్యాటక, వ్యాపార ప్రయాణాలను ఆకర్షించడం ద్వారా ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహిస్తుందని వివరించారు.

బైపాస్‌ను నిర్మించకుంటే నిరాహారదీక్ష

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత ప్రైవేటు కంపెనీతో మాట్లాడి బైపాస్ రోడ్డు త్వరితగతిన పూర్తయ్యేలా సంప్రదింపులు జరపాలన్నారు. ఈ అంశమై పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇందుకోసం మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్‌లు, ఎంపిపి, జెడ్‌పిటిసి, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు 200 మందిని తీసుకుని వచ్చారు. పిడుగురాళ్ల పట్టణానికి బైపాస్ నిర్మాణం చాలా అవసరమని, అయితే దీనిపై కాంట్రాక్టు కంపెనీ నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు. అనేక వాహనాలు పట్టణంలో గుండా వెళుతున్నాయని, హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే వాహనాలకు పెద్ద సమస్యగా తయారైందని చెప్పారు. పిడుగురాళ్ల పట్టణంలో నుండి వెళుతున్న భారీ వాహనాలను ఎస్పీ చొరవతీసుకుని నియంత్రించాలని కోరారు. అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి 212 కిలోమీటర్లు, హైవే 206 కిలోమీటర్ల 2013లో పూర్తి చేశారని, పిడుగురాళ్ల హైవే విషయంలో మాత్రం పదేళ్లుగా జాప్యం చేస్తున్నారని వివరించారు. 2022 జనవరిలో అన్ని అనుమతులూ ఇప్పించినా బై పాస్ రోడ్ నిర్మాణం ఆలస్యం అవుతుందని ఆగ్రహం వెలిబుచ్చారు. ఇప్పటకైనా స్పందించి త్వరితగతిన పూర్తి చేయకుంటే 10వ తేదీ నుండి టోల్‌గేట్ వద్ద నిరాహార దీక్ష చేపడతామన్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణం ప్రభుత్వ పరిధిలో లేదని, పనులు దక్కించుకున్న కంపెనీ చేయాల్సి ఉందని అన్నారు.

మీ కృషికి మా సహకారం..

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తూనే పేదరికం నుంచి ఉపాధి రంగం వైపు దృష్టి పెట్టామన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయ ప్రాధాన్యం ఇచ్చినట్లు చెప్పారు. నవోదయం, పల్లెనిద్ర, బడినిద్ర, గ్రామోదయం, క్లాప్ మిత్ర, ఎ డే విత్ కలెక్టర్ తదితర వైవిధ్య భరితమైన కార్యక్రమాలను నిర్వహించి జిల్లా ప్రజలకు దగ్గరయ్యామని వివరించారు. ఈ ఏడాదిలో మరింత అభివృద్ధి దిశగా ప్రజలతో మమేకమై పని చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెసి శ్యాంప్రసాద్, డిఆర్ఒ వినాయకం, ఆర్డీవవో ఎం.శేషిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు, కళాకారులు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ప్రతి ఒక్కరూ ఆదార్ అప్‌డేట్ చేసుకోవాలి

ప్రజాశక్తి- ప్రత్తిపాడు

ప్రతి ఒక్కరూ ఆదార్ అప్‌డేట్ చేసుకోవాలని ప్రత్తిపాడు ఎంపిడిఓ శ్రీరమ్య తెలిపారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి మల్లయపాలెం సెంటర్ వైఎస్ఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆదార్ కేంద్రాలలో ఆదార్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. బాంక్ పాస్‌పుస్తకాలకు ఆదార్ లింక్ చేసుకుంటే ప్రభుత్వ అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. మండలంలో ప్రత్తిపాడు సచివాలయం-1, నడింపాలెం సచివాలయం-2 , గొట్టిపాడు, పాత మల్లయపాలెం సచివాలయాల్లో ఆదార్ కేంద్రాలుగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్‌శకాధికారి ఎం. మోషే, మండల పరిషత్ పరిపాలనాధికారి డి.రామకోటయ్య, వైఎస్అర్ క్రాంతి పథం అదికారి సురేష్ కుమార్, ప్రత్తిపాడు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సచివాలయం అదికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఓ శ్రీరమ్య

మూడో విడత ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కొల్లిపర: మహిళల ఆర్థిక స్వాలంబనే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం అడుగులు వేస్తుందని జిల్లా పరిషత్ జెడ్పి చైర్‌పర్సన్ కత్తెర హేన్రి క్రిష్టినా అన్నారు. మంగళవారం స్థానిక పాలకేంద్రం కళ్యాణ మండపంలో 12 గ్రామాలకు చెందిన పొదుపు సంఘాల మహిళలకు వైయస్సార్ మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని 776 సంఘాలకు 642 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి.పద్మావతి, సంజీవరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బి.పోతురాజు, ఏపీఎం ప్రియదర్శిని, మండల పార్టీ అధ్యక్షులు అరిగా చంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు. **ఫిరంగిపురం** :మండలంలోని రేపూడి మార్కెట్ యార్డులో జరిగిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ జెడ్పి చైర్‌పర్సన్ కత్తెర హేన్రి క్రిష్టినా పాల్గొని చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ , నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జడ్పిటిసి దాసరి కత్తిరేణమ్మ ఎంపీపీ షహేలనర్గిస్, వైస్ ఎంపీపీ లు మార్పుల విజయలక్ష్మి, గుమ్మడి చంద్రం, వైసీపీ నాయకులు పాల్గొన్నారు? **మేడికొండూరు** : మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మరలా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీ అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం మేడికొండూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ , ఎంపీపీ మన్నవ స్వప్న, జడ్పిటిసి కందుల సిద్దయ్య, వైస్ ఎంపీపీ భవనం రాజశేఖర్ రెడ్డి, ఎమ్మార్వో కరుణ కుమారి, ఎండిఓ శోభారాణి, మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరు వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.**తెనాలిరూరల్**:వైసిపి ప్రభుత్వంలో అమలయ్యే ప్రతి పథకం మహిళలు సాధికారతను సాధించి, వారి ఎదుగుదలకు దోహదపడేలా ఉంటాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన వైయస్ఆర్ ఆసరా మూడో విడత నిధుల పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెనాలి పట్టణ పరిధి 30 నుండి 34 వార్డుల్లో 1456 డ్వాక్రా సభ్యులకు రూ 1.46 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందజేసారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న హెన్రీ క్రిస్టినా

కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, పురపాలక సహాయ కమీషనర్ యం.గోపాలరావు, వార్డు కౌన్సిలర్లు కె.జయపాల్, జి.మానసరెడ్డి, ఎం.సంధ్యారాణి, మొఘల్ అహ్మద్ బేగ్, పి. సంజీవరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గున్నారు. **గుంటూరు జిల్లా ప్రతినిది**:ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో వైసిపి ప్రభుత్వం చిత్త శుద్దితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే మద్దాలి గిరి అన్నారు. మంగళవారం సాయంత్రం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 44,45,49,52 డివిజన్లలలోని డ్వాక్రా మహిళలకు, సచివాలయం కన్వీనర్లకు, గృహ సారదులతో సమావేశం నిర్వహించారు. గిరిధర్ అక్క చెల్లెమ్మల కోసం వైఎస్ఆర్ ఆసరా పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా మూడోవ విడత చెక్కులను పంపిణీ చేశారు. కార్పొరేటర్లు వంగల హేమలత,వలివీరా రెడ్డి, యక్కలురి మారుతి, బి.ఉషారాణి, ఎం.శ్రీ వల్లి, కన్వీనర్ల ఇంచార్జ్ మొహమ్మద్ బాబు ఖాన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ షాపులో చోరీ

రూ.1లక్ష నగదు, రెండు సెల్‌ఫోన్లు అపహరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని ఉండవల్లి సెంటర్ డౌన్‌లో జెబి కమ్యూనికేషన్స్ సెల్‌ఫోన్ షాపులో సోమవారం అర్ధరాత్రి దుండగలు షాపులోకి ప్రవేశించి చోరీ చేసిన సంఘటన చోటు చేసుకుంది. షాపు యజమాని జె. ఫకీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం అర్థరాత్రి సమయంలో దుండగులు షాపులోకి ప్రవేశించి రూ. 1లక్ష నగదు, 2 సెల్‌ఫోన్లు అపహరించుకోని పోయారని తెలిపారు. షాపు తాళాలు వేసినవి వేసినట్లే ఉన్నాయని, రౌండ్ మెట్ల మీదుగ దుండగులు షాపులోకి చొరబడ్డారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకోని సిసి టివి ఫుటేజి ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్మశాన స్థలం విషయంలో వివాదం

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరిలో శ్మశాన స్థలం విషయంలో వివాదం చోటు చేసుకున్న సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం గ్రామంలో ఒక సామాజిక వర్గానికి చెందిన దళితులకు శ్మశాన స్థలం సరిగా లేకపోవడంతో స్థలం కేటాయించాలని గత కొన్ని ఏళ్లుగా ఆయా పార్టీ నాయకులను అభ్యర్థించిన ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలో మాదిగ సమాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల చనిపోవడంతో, మాల సామాజిక వర్గానికి చెందిన శ్మశాన వాటికలో పూడ్చిపెట్టడంతో వివాదం మొదలైంది. మా శ్మశాన వాటికలో పూడ్చిపెట్టడం సరైన పద్ధతికాదని ఇరు వర్గాలు ఆదోళనకు దిగారు. స్థానిక పట్టణ పోలీసులు స్టేషన్‌కి పిలిపించి మాట్లాడతామని చెప్పడంతో ఆందోళనలను విరమించారు.

వినాయకుని విగ్రహం ధ్వంసం

ప్రజాశక్తి -ఫిరంగిపురం

మండలంలోని హౌస్ గణేష్ గ్రామంలోని కొండపైన వినాయకుని మండపంలోని వినాయకుని విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ్న గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం విగ్రహాన్ని పగుల కొట్టి ధ్వంసం చేశారని తెలిపారు. గ్రామ ప్రజలు ప్రతి ఏడాది వినాయక చవితికి, శివరాత్రికి కొండపైన గల వినాయకుని విగ్రహానికి పూజలు నిర్వహిస్తూ ఉంటారని ఈనెల 1వతేది రాత్రి 6 గంటల వరకు వినాయక విగ్రహం బాగానే ఉందని, 2వ తేది రాత్రి ఏడు గంటల సమయంలో ఊరిలోని ప్రజలు పూజలు నిర్వహించేందుకు కొండపైకి వెళ్లి చూడగా గుడిలోని వినాయకుని విగ్రహం సగం విరిగి క్రిందపడి ఉందని తెలిపారన్నారు. 3వ తేది ఉదయాన్నే గ్రామ సర్పంచ్ వేల్పుల వీరయ్యకు తెలుపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తుళ్లూరు డిఎస్‌పి , మేడికొండూరు సిఐ తాడికొండ సిఐ, ఫిరంగిపురం ఎస్ఐ నేర స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసిబాధ్యులైనవారిని త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

వినుకొండ పట్టణంలో తిష్ట వేసిన సమస్యలు

- డ్రెయినేజీ లేక సిసి రోడ్లపై నిలిచిన మురుగునీరు
- అధికారుల నిర్లక్ష్యానికి నేల వాలిన విద్యుత్ స్తంభం
- పక్కదారి పడుతున్న మున్సిపల్ నిధులు
- ప్రజలకు సమాధానం చెప్పలేక పోతున్నామంటున్న కౌన్సిలర్లు

గాలిదుమారానికి తెగిపడిన విద్యుత్ తీగలు

ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ పట్టణంలో ఎక్కడ చూసినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. సిసి రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేక, ఉన్న కాలువల్లో పూడికలు తీయక, కూలడానికి సిద్దంగా ఉన్న పురాతన ఐరన్ విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ చేయకపోవడం, ఇలా అనేక సమస్యలతో పట్టణ పుర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం, ఈదురు గాలుల బీభత్సానికి కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు ఒకవైపు ఒరిగిపోవడం, కూలిపోవడం జరిగింది. సిసి రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీ లేకపోవడంతో వర్షం నీరు రోడ్లపై చేరి తటాకాన్ని తలపిస్తున్నాయి. మురుగునీరు పారుదల లేక వర్షం నీళ్లతో నిండి రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధాన్ని వెదజల్లాయి. కొన్నిచోట్ల దశాబ్దాల కాలం నాడు వేసిన ఐరన్ విద్యుత్తు పోల్స్ తో కరెంటు ఎర్త్ రావడం లాంటి పరిస్థితులూ నెలకొన్నాయి. పట్టణానికి దిగువ ప్రాంతంలో ఉన్న డబ్బా స్తంభం సెంటర్, అంబేద్కర్ కాలనీ, రైలు పేట, ఇందిరానగర్, శ్రీనివాస కాలనీ, డ్రైవర్స్ కాలనీ, కళ్యాణపురి కాలనీ, వెన్నపూస కాలనీ,

డ్రైనేజీ లేక మురుగుతో కలిసి నిలిచిపోయిన వర్షపు నీళ్లు

ముట్లకుంట కాలనీ, హనుమాన్ నగర్, సంజయ్ గాంధీ నగర్, స్లీపర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతితం. స్థానిక ఏనుగుపాలెం రోడ్డు అంకాలమ్మ పేటలో సిసి రోడ్డుపై వర్షం నిరూపించిపోయింది. అలాగే మార్కాపురం రోడ్ లోని లారీ అసోసియేషన్ ఆఫీస్ వద్ద రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ వర్షం నీరు నిలిచిపోయింది. పట్టణంలోని శంగార వనంలో డ్రైనేజీ మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. శాలివాహన నగర్ లో ఈదురు గాలులకు కరెంటు స్తంభం కూలిపోయింది. పాలకవర్గం ఏర్పడి రెండేళ్ల గడుస్తున్నా కొన్ని పనులు కూడా చేయలేదని, వార్డుల్లో ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చేప్పలేకపోతున్నా మంటూ వార్డు కౌన్సిలర్ వాపోతున్న పరిస్థితి వినుకొండలో నెలకొంది. కౌన్సిల్ సమావేశాల్లో సమస్యలను పరిష్కరించే దిశగా అధికారుల చర్యలు లేవని సభ్యులు తెలుపుతున్నారు. 32 వార్డులకు గాను 28 వార్డులు అధికార పార్టీ చెందిన కౌన్సిలర్లు ఉండగా కౌన్సిల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమస్యలపై ప్రశ్నించరాదనే వారి నేత ఆదేశాలతో నోరు మెదిపే పరిస్థితి లేదనే చెప్పాలి. ప్రతినెలా కౌన్సిల్ సమావేశానికి ముందు చైర్మన్ కార్యాలయంలో జరిగే ప్రీ కౌన్సిల్లో వార్డు సమస్యలను ప్రస్తావిస్తే అధినేత ఆదేశాలతో వారికి నచ్చిన వార్డుల్లో నిధులు కేటాయింపు జరుగుతున్నట్లు తెలుస్తుంది. దీంతో వార్డుల్లోని ప్రజా సమస్యలు పరిష్కారం కాక మౌలిక వసతులు లేక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వాటిల్లో సమస్యలు పేరుకుపోయాయి. పట్టణంలోని ప్రజల నుండి పన్నుల రూపేణా మున్సిపాలిటీకి వచ్చే నిధులన్నీ పక్కదోవ పట్టించి ప్రజల సమస్యలు గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రజల పట్ల చిత్తశుద్ధి వహించి వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మెల్లంపూడిలో అరటి తోట దగ్ధం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధి లోని మెల్లంపూడి పరిధిలోని, నూతక్కి శివారు, గ్రామానికి చెందిన బొమ్మ రెడ్డి దామోదర రెడ్డి అనే రైతు అరటి తోట మంగళవారం మధ్యాహ్నం విద్యుత్ ఘాతానికి గురై దగ్ధ మైంది. ఎకరం 50 సెంట్లు వేసిన అరటి తోట మొత్తం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో వైర్లు తెగిపడి, పంట మొత్తం కాలి బూడిదై పోయింది. అరటి తోటలో ఉన్న డ్రిప్ పైప్స్ మొత్తం కాలి పోయాయి. సుమారు రూ.5 లక్షల పంట నష్టం వాటిల్లిందని గ్రామానికి చెందిన రైతు తెలిపారు. మధ్యాహ్న సమయం కావడంతో, సమయానికి ఎవరు పొలంలో లేకపోవడంతో ఎవరికి ఎటువంటి ప్రాణ హాని జరగకపోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా మహావీర్ జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి:

జైనుల మత గురువు మహావీర్ జయంతి ఉత్సవాలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. జైనులు అధిక సంఖ్యలో స్థానిక షరాఫ్ బజార్‌లోని మార్వీడీ గుడికి చేరుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం అక్కడి నుంచి పెద్దఎత్తున ర్యాలీగా బయలుదేరి నెహ్రూరోడ్, బోస్‌రోడ్డు మీదుగా గాంధీ చౌక్‌కు చేరుకున్నారు. ర్యాలీలో మార్వీడీ యూత్, వ్యాపారులు నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తెనాలి:

పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు ఆలయ సహాయక కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి మంగళారం తెలిపారు. గత పాలక మండలి గడువు ముగిసిన నేపథ్యంలో గుంటూరు జోన్ దేవదాయ ధర్మాదాయ శాఖ ఉపకమిషనర్ ఆదేశాల మేరకు దరఖాస్తులు ఆహ్వానినస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ప్రకటన వెలువడిన 20 రోజుల్లోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. ఆలయ పనివేళల్లో ఉచితంగా దరఖాస్తును పొంది, పూర్తి చేసి ఆలయంలో సమర్పించాల్సిందిగా కోరారు.

నేటి నుండి మహనీయుల జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

బాబు జగజ్జివన్‌రామ్ జయంతి రోజైన ఏప్రిల్ 5 నుండి మహనీయు లైన బాబు జగజ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిరావుపూలే, బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ జయంతిని వాడవాడల ఘనంగా జరపాలని బీమ్‌భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ళ ప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం అరండల్‌పేటలోని బీమ్ భారత్ కార్యాలయంలో మహనీయుల జయంతి మహెూత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.అణగారిన దళిత బహుజనుల స్థితిగతులను నెమర వేసుకుంటూ దేశములోగానీ, రాష్ట్రంలోగానీ అవలంబిస్తున్న విధానాలపై విస్తతంగా చర్చిస్తూ, మహనీయుల ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు.కార్యక్రమంలో భీమ్ భారత రాష్ట్ర నాయకులు జల్ది మోహన్, దొడ్డ రాజేంద్రప్రసాద్, పసుమర్తి రమేష్ కుమార్, మేకా రవి కుమార్, జిల్లా నాయకులు సుజాత రావు,దాసరి గురవయ్య, ఎస్.కె.బాజీ, రజిమ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆరోగ్య మిత్రలు, సచివాలయ ఎఎన్ఎంలు అందిస్తున్న సేవలను ప్రజలు

వినియోగించు కోవాలని డాక్టర్ కెవి కిరణ్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక ఆసుపత్రిలో సెక్టార్ ఆరోగ్యశ్రీ శిక్షణ నియామావళి బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అందిస్తున్న సేవల గురించి జిల్లా ఆరోగ్య టీం లీడర్ ఎస్.బాలస్వామి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నాగేంద్రబాబు, మానస, ఆరోగ్య శ్రీ టీం లీడర్ బాలస్వామి, ఆరోగ్య మిత్ర కె.సూర్యనారాయణ, సిహెచ్.గురుకుమార్, డిపిఎంఒ రామచంద్రరావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌కె నాగుల్‌మీరా, శ్రీలక్ష్మి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

ప్రజాశక్తి-తెనాలి:ఆలయంలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగి కుటుంబ సభ్యునికి కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయ సహాయక కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి మంగళ వారం వెల్లడించిన వివరాల ప్రకారం ఆలయంలో అటెండరుగా విధుల నిర్వహిస్తూ మృతి చెందిన ఉల్లంగుల వీర వసంతరావు కుమార్డు అంకమ్మరావుకు కారుణ్య నియామకం కింద అటెండర్‌గా నియామక పత్రాన్ని అందించా మన్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

KANAKADURGA FINANCE LIMITED

(RBI ద్వారా గుర్తింపు పొందినది)

బ్రాంచిఆఫీస్ : 6-9-18/ఎ, 1వ అంతస్తు, 9/1 అరండల్‌పేట, లిబాస్ బిల్డింగ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రక్కన, గుంటూరు.
1st ఫ్లోర్, మహావీర్‌కాలేజ్ ఎదురు, మెయిన్‌రోడ్, గుంటూరు- నల్లచెరువు
1st ఫ్లోర్, ప్రవీణ్ ప్లాజా, తాలూక ఆఫీస్‌ఎదురు, రేపల్లె.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 24.04.2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 577.32 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంకట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్

కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్

H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.

Cell : 8008812798

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE CUM MACT AT SRIKAKULAM
M.V.O.P No. 237/2021

Between:
Mamidi Venkata Surya Krishna Pratap & others -Petitioners
And:
Nudurupati Putta Kotayya & others -Respondents

To,
R-2 D.Mallikharjuna Rao S/o Narasimha Rao, Hindu, aged 47 years, Owner of the Lorry **AP07T 4842**, residing at Dubagunta Vari Street, Near Post office, Kottapeta, Guntur District.

Please take notice that the above matter is posted to **06.04.2023 at 10.30 A.M.** for your notice to appear before the hon'ble court either In person or through an advocate for filing your counter if any falling which the matter will be heard in your absence.

PUDI RAMBABU
Advocate,
Srikakulam
Cell : 94403435588

దావాసమను
మహారాజశ్రీ సత్తెనపల్లి సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం. 380/2016

బిట్వీన్ :
అమరనేని వెంకటేశ్వర్లు ... వాది
మరియు
అమరనేని వెంకటకృష్ణయ్య మరియు 9 మంది .... ప్రతివాదులు

టు
ప్రతివాదులు 8 : ఏటుకూరి వీణా సౌజన్య భర్త రత్నకుమార్, పెదకూరపాడు గ్రామం, మండలం, పల్నాడుజిల్లా,
ప్రతివాదులు 9 : రాయవరపు బ్రహ్మం, తండ్రి భూషయ్య, బలుసుపాడు గ్రామం, పెదకూరపాడు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు దావాను వాది షెడ్యూలు దాఖలా ఆస్తులపై భాగపంపిణీ కోరుచూ దాఖలు చేయడమైనది. పై దావా యందు 8, 9 ప్రతివాదులైన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ మీరు ముట్టనందున శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది. పై నెంబరు దావా ది.8-5-2023న వాయిదా అయివున్నది. కావున పైన తెలిపిన తేదీన పై కోర్టువారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను.
వాయిదాతేది: 8-5-2023

వి.పాపారావు,
వాది తరపు న్యాయవాది,
సత్తెనపల్లి.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 52/2021

బిట్వీన్:
ద్వారంపూడి మహేశ్వర సత్యచంద్రారెడ్డి -వాది
మరియు
జొన్నాదుల భవ్యశ్రీ -ప్రతివాది

ప్రతివాది: జొన్నాదుల భవ్యశ్రీ, స్త్రీ, వయస్సు 30 సం॥లు, W/o. తిరువీధుల రవీంద్ర, డోర్ నెం. 5-468/2, బాలాజీనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా.

పై నెంబరు గ్రంథంలో శ్రీ కోర్టు ద్వారా ప్రతివాదికి సమన్లు పంపించినప్పటికి అవి తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వులు ప్రకారం **ది. 02-05-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఏమైనా ఉన్నచో తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

అద్దంకి విజయరత్నం
తాడేపల్లిగూడెం అడ్వకేట్, తాడేపల్లిగూడెం
ది.04-04-2023 సెల్:9290188928

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఫ్యామిలీ ఫిజీషియన్ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని మండలంలోని లింగంగుంట్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా ఏర్పాట్లను ముమ్మరం చేశారు. సభ వేదిక, ప్రాంగణం, పరిసరాల్లో పోలీసు భద్రత, ఇతర ఏర్పాట్లను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డితో కలిసి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని మంగళవారం పరిశీలించారు. వివిఐపిల రాకకోసం సిద్ధం చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణాన్ని పరిశీలించారు. ఆ ప్రదేశానికి చుట్టుప్రక్కల ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకూ తావులేకుండా పహారా ఏర్పాటు చేయాలని ఎస్పీకి మంత్రి సూచించారు. హెలిప్యాడ్ నుండి సభాస్థలికి వివిఐపిలు పయనించే మార్గాన్ని స్వయంగా తిరిగి పరిశీలించారు. రోడ్డుకు ఇరువైపులా భారీకేడింగ్‌లతో కట్టుదిట్టంగా భద్రత కల్పించాలన్నారు. అనంతరం సభా స్థలిని ముఖ్యమంత్రి పర్యటన పరిశీలన కో-ఆర్డినేటర్ అయిన ఎమ్మెల్సీ తలశిల రఘురాం పరిశీలించారు. వివిధ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సభకు వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తున్న భారీ కెడింగ్, క్యూలైన్లను పరిశీలించి, వాటినీ పటిష్టంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, వాహనాల క్రమబద్ధీకరణకు తగినంత సిబ్బందిని నియమించాలని, అవసరమైనచోట ట్రాఫిక్ డైవర్షన్లు, స్టాప్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. హెలిప్యాడ్, సభాప్రాంగణం, వివిఐపిలు ప్రయాణించే మార్గాల్లో నిఘా వర్గాలతో నిరంతర పహారా నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, సిఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెసి శ్యాంప్రసాద్, ఎఎస్పీ(అడ్మిన్) జి.బిందుమాధవ్, ఎఎస్పీ (ఏఆర్) రామచంద్రరాజు, నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కర్‌రావు, ఎఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఎస్బి సీఐ ప్రభాకర్, చిలకలూరిపేట రూరల్, టౌన్ సిఐలు రాజేశ్వరరావు, అచ్చయ్య, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

ఏర్పాట్లపై ఎస్పీతో చర్చిస్తున్న మంత్రి విడదల రజిని

వార్డుల్లో బైక్‌పై ఎమ్మెల్యే శానిటేషన్ రైడ్..

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు పురపాలక సంఘం చేస్తున్న కృషికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. 25, 26వ వార్డుల్లోని ఓల్డ్ శివ గెస్ట్‌హౌస్, ఫైర్‌స్టేషన్, పెద్ద చెరువు ప్రాంతాల్లో ఎమ్మెల్యే మంగళవారం బైక్‌పై పర్యటించి పారిశుధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసరావుపేట పురపాలక సంఘం తన చరిత్రలోనే ఆస్తి పన్ను వసూళ్లలో టాప్ 20లో నిలిచిందన్నారు. ఆదాయం రూ.16.25 కోట్లకుగాను రూ.13.76 కోట్లు వసూలు చేసిందన్నారు. గత ఆర్థిక సంవత్సరం ఇది రూ.7 కోట్లు మాత్రమేనన్నారు. పన్ను వసూలు చేసిన అధికారులు, అందుకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పరిశుభ్రత అందరి బాధ్యతని, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పచ్చదనంతో పాటు పరిశుభ్రతకూ ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రోడ్లపైన చెత్త వేయొద్దని, వాహనాల్లో వచ్చే మున్సిపల్ సిబ్బందికే ఇవ్వాలని కోరారు. పర్యటనలో ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఇంజినీర్ డి.శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల వెంట వ్యర్థాలపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

మట్టి వాహనాల ధాటికి కూలిన చప్టా

పున:నిర్మాణం కోసం రైతుల వేడుకోలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భారీ వాహనాల రాకపోకలు కారణంగా సత్తెనపల్లి మండలం భీమవరంలో చప్టా కూలింది. భీమవరం నుండి మారుతి నగర్ వెళ్లే మార్గంలో చప్టా కూలటంతో పొలాలకు వెళ్లి రావడానికి రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భీమవరం-మారుతీ నగర్ మధ్యలో జగనన్న కాలనీకి మట్టి తోలకం కోసం భారగా టిప్పర్లు రాకపోకలు సాగించిన నేపథ్యంలో ఈ పరిస్థితి తలెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిదులు సత్వరమే స్పందించాలని, చప్టాను పున:నిర్మించాలని కోరారుతున్నారు.

కలెక్టర్ శివశంకర్‌కు జ్ఞాపిక ఇచ్చి సత్కరిస్తున్న నాయకులు

పల్నాడు జిల్లా కలెక్టర్‌కు సత్కారం

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు కలెక్టరేట్ ఐఎస్ఒ ధ్రువపత్రం సాధించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్‌ను దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్ అధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. మహాలక్ష్మి ఫొటో స్టూడియో అధినేత వెంకట రమణ మహాలక్ష్మి కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి క్యానన్ కంపెనీ ఫొటో-వీడియో కెమెరాను ప్రారంభించారు. ఆ కెమెరాలతో కలెక్టర్ అందర్నీ ఫొటోలు తీసి ఆశ్చర్యపరిచారు.

లింగారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయవాదులు

ఘనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగారెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారూరి లింగారెడ్డి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన వేడుకల్లో కేక్‌ను లింగారెడ్డి కట్ చేయగా ఆయనకు పలువురు న్యాయవాదులు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎపిపి బి.నరశింహారావు, న్యాయవాదులు జి.అజయ్‌కుమార్, డి.శ్రీనివాసరావు, జె.విజయ్‌కుమార్, ఏడుకొండలు, ఎన్.వేణుగోపాల్, రాజారావు, నరసింహారావు, హనుమయ్య పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న ఆర్‌డిఒ రాజకుమారి తదితరులు

ఆర్‌డిఒ కార్యాలయంలో వార్షిక వేడుకలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆర్‌డిఒ బిఎల్ఎన్ రాజకుమారి ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఆర్‌డిఒ కట్ చేసి మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల సహకారంతో డివిజన్‌లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించామని అన్నారు. వేడుకల్లో సత్తెనపల్లి, ముప్పాళ్ల, తహశీల్దార్లు కె.నగేష్, భవానీ శంకర్, రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలతోపాటే పెరుగుతున్న తేదీలు

4వ తేదీనా అందని సామాజిక పింఛన్లు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సామాజిక పింఛన్ల పంపిణీలో నిబంధనలతోపాటు తేదీలూ పెరుగుతున్నాయి. తొలుత వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు తదితర జాబితాలో ఉన్నవారందర్నీ సామాజిక పింఛన్లు పొందడానికి అర్హులుగా పరిగణించారు. అయితే రానురాను అనేక నిబంధనలను పెంచారు. గతంలో ఒకటో తేదీ పొద్దున్నే పింఛన్లు పంపిణీ చేయగా ఇప్పుడు నాలుగైదు తేదీలు వచ్చినా అందలేదు.

చిలకలూరిపేట పట్టణంలో 29 వార్డు సచివాలయాల పరిధిలో 11,540 మంది సామాజిక పింఛన్లు పొందేవారున్నారు. మండల పరిధిలో 29 గ్రామాలు ఉండగా వీటిల్లో 16 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో మరో 8,495 మంది పింఛనుదారులున్నారు. నాదెండ్ల మండలంలో 16 గ్రామాలకు గాను 14 గ్రామ సచివాలయాల పరిధిలో 9,323, యడ్లపాడు మండలంలో 22 గ్రామాల్లోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో 9 వేలమంది సామాజిక పింఛను పొందేవారున్నారు. విద్యుత్ బిల్లులు, ఇంట్లో ఉద్యోగులు, పొలం, ప్రభుత్వ పెన్షనర్లు ఇలా అనేక నిబంధనలు, సాంకేతిక సమస్యలను అధిగమించి వీరంతా పెన్షన్లకు అర్హత సాధించారు. వివిధ కారణాల రీత్యా రెండు మూడు నెలల పాటు పింఛను తీసుకోకున్నా తర్వాతైనా తీసుకునే వీలు గతంలో ఉండేది. అయితే ప్రభుత్వం ఈ వెసులుబాటునూ తొలగించింది. ఏ నెల పింఛను ఆ నెలే తీసుకోవాలని, లేకుంటే మళ్లీ ఇవ్వబోరని నిబంధన పెట్టింది. తాజాగా పింఛనుదారుడు తాను నివాసం ఉండే సచివాలయ పరిధికి 15 కిలోమీటర్ల తర్వాత పింఛను పొందే అవకాశం లేకుండా మార్పులు చేశారు. ఇతర ప్రాంతాల్లో ఉండి వైద్యం పొందే వారికి వాలంటీర్లే వెళ్లి పింఛను ఇచ్చేవారు. ఇప్పుడిక అదీ దక్కే వీలుండదని తెలుస్తోంది.

ఏ ఆధారమూ లేని వారు, ప్రభుత్వం నుండి ఆర్థిక చేయూత అవసరమైన వారు పింఛనే ఆధారంగా జీవిస్తుంటే నిత్యం వారిపై నిబంధనల కత్తి వేలాడదీస్తున్నారనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. మరోవైపు పింఛను పంపిణీ చేసే తేదీలనూ ప్రభుత్వం క్రమంగా పెంచుతూ వస్తోంది. వైసిపి అధికారంలోకి వచ్చాక వాలంటీర్ వ్యవస్థను తెలిచ్చిన విషయం తెలిసిందే. ప్రతి వాలంటీర్ ఒకటో తేదీన పొద్దున్నే పింఛను అందించి ఫొటోలు దిగేవారు. రానురాను అది ఒకటో తేదీ సాయంత్రానికి, రెండో తేదీకి మారుతూ వస్తోంది. ప్రస్తుతం నాలుగో తేదీ అయినా పింఛను అందలేదు. కొద్దిమందికి నాలుగో తేదీ సాయంత్రం పంపిణీని ప్రారంభించారు. ఈ క్రమంలో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పింఛను డబ్బు ఆధారంగా దుకాణాల్లో సరుకులు, మెడికల్ షాపుల్లో మందులు తెచ్చుకుంటామని, రానురాను వాటికీ అవాంతరాలు వస్తున్నాయని వాపోతున్నారు. సాధారణంగా పింఛను సొమ్ము డిఆర్‌డిఎ సంస్థ నుండి పట్టణంలోని యూనియన్ బ్యాంకుకు జమవుతాయని, పట్టణంలోని 29 సచివాలయ ఖాతాల్లో జమైన ఈ నగదును డ్రా చేసి వాలంటీర్ల వారీగా పంపిణీ చేస్తారని అధికారులు చెబుతున్నారు. బ్యాంకులో నగదు జమవడం, వాటిని డ్రా చేసి వాలంటీర్లకు అందించే క్రమంలో కొద్దిపాటి ఆలస్యం అవుతోందని, కొన్ని సందర్భాల్లో బ్యాంకుల్లో సరిపడా నగదూ అందుబాటులో ఉండక మరుసటి రోజు డ్రా చేయాల్సి వస్తోందని అధికారులంటున్నారు.

పారిశుధ్య కార్మికురాలికి అస్వస్థత

ప్రజాశక్తి - తుళ్లూరు

మంగళవారం తుళ్లూరులో కాలువలు తీస్తున్న పారిశుధ్య కార్మికురాలు భూక్యా పార్వతి ఎండ తీవ్రతకు స్పృహ తప్పి క్రింద పడిపోగా, వెంటనే కార్మికులు తుళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తుళ్లూరు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు బాధితురాలికి వైద్య సేవలు అందించారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి, సిఆర్‌డిఎ సూపర్వైజర్లు హాస్పిటల్లో కార్మికురాలిని పరామర్శించారు. అనంతవరం రవి మాట్లాడుతూ అనంతవరం గ్రామానికి చెందిన నలుగురు పారిశుధ్య కార్మికులను ఆ గ్రామంలో కార్మికులు ఎక్కువయ్యారనే సాకుతో అక్కడి సూపర్వైజర్ మంగళవారం తుళ్లూరులో పారిశుధ్య విధులు నిర్వహించండి అంటూ కార్మికులను పంపించాడని చెప్పారు. అనంతవరం నుండి తుళ్లూరు వచ్చి విధులు నిర్వహిస్తూ కార్మికురాలు పార్వతి ఎండవేడికి స్పృహ తప్పి పడిపోవడంతో తోటి కార్మికులు ఆందోళనకు గురయ్యారని అన్నారు. అనంతవరం గ్రామంలో గతంలో 20 మంది కార్మికులు విధులు నిర్వహించేవారని, వీరిలో నలుగురు కార్మికులు విధులు మానేయగా మిగిలిన 16 మంది కార్మికులలో ప్రతిరోజూ నలుగురు కార్మికుల చొప్పున దొండపాడు బైపాస్, తుళ్లూరు, లింగాయపాలెం ఇలా ఇతర గ్రామాలకు పంపిస్తున్నారని చెప్పారు. 16 మంది కార్మికుల్లో నలుగురు ఇతర గ్రామాలకు వెళితే, మిగిలిన 12 మందిలో ఒకరిద్దరు సెలవులు పెడుతుండటంతో పదిమంది పైనే పని భారం పడుతుందని, ఇదే కొనసాగితే అనంతవరం గ్రామంలో పారిశుధ్యం కుంటు పడే ప్రమాదం ఉందన్నారు. గ్రామంలోని పెద్దలెవరికి ఈ విషయం పట్టినట్టుగా లేదని, తమ గ్రామంలో కార్మికులను పనిచేయనివ్వకుండా ఇతర గ్రామాలకు ఎందుకు పంపిస్తున్నావని గ్రామ ప్రజలు సూపర్వైజర్ ను నిలదీయకుండా చోద్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన ఇతర గ్రామాలలో పనికి వెళ్లిన పారిశుధ్య కార్మికులు అనారోగ్యం పాలవటం, మరో ప్రక్క గ్రామంలో పారిశుధ్యం కుంటుపడే పరిస్థితి వస్తుందని చెప్పారు.

భూక్యా పార్వతిని పరామర్శిస్తున్న ఎంరవి, కార్మికులు

చలోఢిల్లీకి తరలిన తాడేపల్లి వాసులు

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ నెల 5వ తేదీ జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి తాడేపల్లి పట్టణం, రూరల్ గ్రామాల నుంచి మంగళవారం ఉదయం రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సుర్యనారాయణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను కార్మిక, కర్షక, రైతులు, కౌలురైతులు వ్యతిరేకించాలని, చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికే ఈ నెల ఒకటో తేదీ నుంచి మూడు దఫాలుగా ఆయా ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారని చెప్పారు. ఢిల్లీకి వచ్చే ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకుని రావాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం పల్లె కృష్ణ, సిఐటియు నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, రైతులు అమ్మిశెట్టి రంగారావు, దొంతిరెడ్డి బుల్లి కోటిరెడ్డి, బి.గోపిరెడ్డి ఢిల్లీ వెళ్లిన వారిలో ఉన్నారు.

రాజకీయాల్లో ఉన్నంతకాలం జగన్‌తోనే ..

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంగళగిరి

రాజకీయాల్లో ఉన్నంతకాలం తాను జగన్ అన్నతోనే ఉంటానని, రాజకీయాలు కాదనుకుంటే పంట చేనులో ఉంటానని ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి అన్నారు. సీఎం జగన్ అధ్యక్షతన సోమవారం జరిగిన ఎమ్మెల్యేల సమావేశానికి తాను గైర్హాజరు కావడం పట్ల ఎల్లో మీడియా అసత్య ప్రచారం చేయడం తగదన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే మీడియాతో మాట్లాడారు. పంటికి సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకోవడంతో పాటు ఇటీవల వివాహమైన తన కుమారుని 16 రోజులు పండుగ నిమిత్తం హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీ సమావేశానికి తాను హాజరు కాలేదని, ఈ విషయాన్ని ఎల్లో మీడియా చిలవలు పలవలు చేయడం సరికాదన్నారు. ఓ ఎమ్మెల్యే సమావేశానికి హాజరు కాలేదంటే దానికి కారణాలు ఏమిటి అనేది సహేతుకంగా చెప్పాల్సిన మీడియా తన బాధ్యతను మరచి ఇష్టం వచ్చినట్లు కథనాలు ప్రసారం చేయడం ధర్మం కాదన్నారు. శాసనసభలో 23 మంది ఎమ్మెల్యేలు ఉంటే చంద్రబాబు పద్ధతి నచ్చక నలుగురు ఎమ్మెల్యేలు పక్కకు వెళ్లారని, మిగిలిన వారిలో ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాలకు పట్టుమని పదిమంది టిడిపి ఎమ్మెల్యేలు కూడా హాజరు కాలేదని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివద్ధే ధ్యేయంగా నిరంతరం తాము చేస్తున్న పర్యటనలను ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మూడు శాఖల మంత్రిగా లోకేష్ నియోజకవర్గం లోని ఏ ఒక్క ఊరిలో పర్యటించిన సందర్భం లేదని, అభివద్ధి పనులు చేసింది లేకపోవడంతో నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించారన్నారు. కుప్పంలో తానే పోటీ చేస్తానని గుండెల మీద చేయి వేసుకుని చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా? అని ప్రశ్నించారు. నేటి సమాజంలో పేదరికం పోవాలంటే బడుగు, బలహీన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా అభివద్ధి లోకి తీసుకురావాలని, భవిష్యత్తులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా తాను కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే ఆళ్ల స్పష్టం చేశారు.

గాంధీ పార్క్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు : గాంధీ పార్కు ఆధునీకరణ పనులు వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని మార్కెట్ సెంటర్‌లో సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గాంధీ పార్కులో రూ.5 కోట్లతో జరుగుతున్న ఆధునీకరణ పనులను అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ అన్ని సదుపాయాలతో పార్కు ఆధునీకరణ పనులు నిర్వహిస్తున్నామని తెలియచేశారు. నగరంలోని ప్రజలు పిల్లలు, పెద్దలు వారి కుటుంబాలతో సహా ఆహ్లాదకరమైన వాతావరణంలో సమయం గడపటానికి గ్రీనరీని అభివద్ధి చేసి పార్కును సిద్ధం చేస్తున్నామన్నారు. పార్కుల్లో పిల్లల ఆట వస్తువులు, పెద్దలకు ఓపెన్ జిమ్, స్కేటింగ్ పరికరాలు, ఫౌంటెన్లు, సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. పార్క్ ఆధునీకరణ పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుంటూరు నగరంలో రోడ్ల విస్తరణ, రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు, పార్కుల అభివద్ధితోపాటు నగరంలోని అనేక స్మశానాల అభివద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే 52 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మానస సరోవరం పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్ పోతురాజు సమత, యస్.ఈ భాస్కర్‌రావు, ఈ.ఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఎడిహెచ్ రామారావు, డి.ఈ.ఈ కళ్యాణ్‌రావు, శ్రీనివాసరెడ్డి, ఎ.ఈలు ఇతర ఇంజినీరింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మేయర్ తదితరులు

టిడిపి నేత నశీర్ అహ్మద్ అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అంజుమన్ ఇస్లామియా ఆస్తులపై బహిరంగ చర్చకు రావాలని టిడిపి, వైసిపిపై జరిగిన మాటల యుద్ధం మంగళవారం పాత గుంటూరులో ఉద్రిక్తతలకు దారితీసింది. ఆస్తుల అన్యాక్రాంతంపై విచారణ చేయాలని కోరుతూ నిరసనకు దిగిన టిడిపి తూర్పు నియోజక వర్గం ఇన్‌ఛార్జి నశీర్ అహ్మద్ ను పోలీసులు అరెస్టు చేశారు. నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆస్తులను ఎమ్మెల్యే ముస్తాఫా స్వాహా చేస్తున్నారని ఆరోపిస్తూ నశీర్ అహ్మద్ బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. ఈ అంశంపై చర్చకు సిద్ధమేనని ముస్తాఫా వర్గం ప్రకటించింది. ఇదే సమ యంలో ముస్తాఫా కారు బిఆర్ స్టేడియంకు సమీ పంలోకి రాగానే టిడిపి కార్యకర్తలు డౌన్‌డౌన్ ముస్తాఫా అని నినాదాలు చేశారు. పోలీసులు వారిని చెదరగొట్టి ముస్తాఫాను ముందుకు పంపారు. నశీర్ అహ్మద్ ఆరోపణలను అంజుమన్ కమిటీ ఖండించింది. నశీర్ అ హ్మద్ తమ కమిటీపై బురదచల్లే ప్రయత్నాలను మానుకోవాలని కమిటీ అధ్యక్షులు, ముస్తాఫా సోదరుడు అబ్దుల్ కర్నూమా అన్నారు. గతంలో పనిచేసిన కమిటీ చాలా వరకు అప్పుల్లో ఉందన్నారు. 2021జులైలో తాము బాధ్యతలు స్వీకరించి నప్పటి నుంచి అంజుమెన్ పాఠశాల ఉపాధ్యాయులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నట్టు తెలిపారు.

ఐక్యపోరాటాలతోనే విజయం

ప్రజాశక్తి -తాడేపల్లి

ఆశాల పోరాట ఫలితంగానే పారితోషకం పేరుతో ఇచ్చే నగదు నేడు వేతనం పేరుతో రూ.10వేలకు పైగా సాధించామని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై నేతాజి తెలిపారు. మంగళవారం తాడేలపల్లిలో ఆశాల సమావేశంలో ఆయన మాట్లాడుతు సమస్యల సాధనకోసం సంఘాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. సమస్యల సాధనకోసం ఆశాలందరూ ఐక్యంగా ఉద్యమించాలని నేతాజీ కోరారు. సమావేశంలో సిఐటియు తాడేపల్లి కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ కార్యదర్శి కె నాగలక్ష్మి, కె శ్యామల, వి రేణుక, కరుణ పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న రాజేంద్రప్రసాద్ సతీమణి మాధవి, మనుమరాలు ఆరాధన

ఘనంగా ఆలపాటి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ జన్మదిన వేడుకలు తెనాలిలో ఘనంగా నిర్వహించారు. వెనిగళ్ళ గోపి కృష్ణ అధ్వర్యంలో ఆలపాటి సతీమణి మాధవి, మనుమరాలు ఆరాధన చేతుల మీదుగా స్వధార్ హోమ్ నిర్వాహకులకు మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేసి, వారికి అన్నదానం చేశారు. స్థానిక పెమ్మసాని థియేటర్‌లో ఆలపాటి జన్మదినం పురస్కరించుకొని ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పట్టణ టిడిపి నాయకులు పలుచోట్ల అన్నదాన శిబిరాలను ఏర్పాటుచేశారు. పట్టణ మార్కెట్ యార్డ్ కార్యాలయం నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, భారీ కేక్ కట్ చేసి రాజేంద్రప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో, దేవినేని రమాదేవి, దేవినేని వెంకటరమణ, ఐటీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్, మహ్మద్ ఖుద్దూస్, తెలుగు విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంచుకోండి : వి.లక్ష్మణరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బాల బాలికలు సృజనాత్మకతను పెంచుకొని లక్ష్యాలను సాధించడానికి శాస్త్రీయ భావజాలంతో కృషి చేయాలని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరులోని పెన్షనర్స్ భవన్ లో జరిగిన అమరావతి జాతీయ ఒలంపియాడ్ 4వ అవార్డుల ప్రధానోత్సవా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్ష్మణ రెడ్డి ప్రసంగిస్తూ ప్రతి విద్యార్థి స్వప్నాలను సాకారం చేసుకోవాలన్నారు. అమరావతి జాతీయ ఒలంపియాడ్ ఫౌండేషన్ తెలుగు రాష్ట్రాలలో దాదాపు 100 విద్య సంస్థలలో గణితం, జనరల్ నాలెడ్జ్, సైన్సు, డ్రాయింగ్, చేతిరాత పరీక్షలు పదివేల మంది బాలబాలికలకు నిర్వహించి వారిలో ప్రతిభగల 109 మంది విదార్థులకు బహుమతులు , అవార్డులు, 42 మంది ఉత్తము ఉపాధ్యాయులకు గురుదేవోభవ అవార్డులతో సత్కరించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అమరావతి ఒలంపియాడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డి. లక్ష్మణ్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, తెలుగు భాష ఉద్యమ నేత డాక్టర్ వి.సింగారావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి పద్మావతి, విద్యావేత్త ఆర్‌వి రామకృష్ణ, కే. సంజీవరెడ్డి, పి.కృష్ణమోహన్, జి శ్రీనివాస్ రెడ్డి, షేక్ మహబూబ్ హుస్సేన్, జాన్ బిట్రు మేరీ తదితరులు ప్రసంగించారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు

సామ్రాజ్యంకు వైవి ఆంజనేయులు నివాళి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని నందిగామకు చెందిన టిడిపి నాయకులు కొమ్మినేని చిన్నసాంబశివరావు, వెంకటరావు తల్లి సామ్రాజ్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు మంగళవారం పరామర్శించారు. సాంబ్రాజ్యం చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎ.అమరేశ్వరరావు, నాయకులు ఎ.సాంబయ్య, సీతయ్య, నాగేశ్వరరావు, అచ్యుత రామారావు, జి.అనురాధ పాల్గొన్నారు.

డ్రెయినేజీ కాల్వలను పరిశీలిస్తున్న కౌన్సిలర్

పారిశుధ్య సమస్యపై కౌన్సిలర్ పరిశీలన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక 8వ వార్డులోని ఆంజనేయస్వామి గుడి వెనుక రజక వీధి, గ్రంథాలయం బజారులో కౌన్సిలర్ కె.కుమారి మంగళవారం పరిశీలించారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని, రోగాల బారినపడుతున్నట్లు స్థానికులు చెప్పారు. ఈ క్రమంలో ఈ వీధిలో నూతన కల్వర్టు నిర్మాణం కోసం కమిషనర్‌ను కోరగా తక్షణ చర్యగా మట్టిని తోలించారు. పరిశీలనలో టిడిపి వార్డు అధ్యక్షులు జి.గంగాధర్, నాయకులు ఎం.మల్లిబాబు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మల్లాదిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - అమరావతి

మండల పరిధిలోని మల్లాదిలో వట్టికుంట చారిటబుల్ ట్రస్ట్ శేషగిరిరావు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ వట్టికుంట శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది 150 మందికి షుగర్, ఎముకలు, గుండె సమస్యలు, దగ్గు, జలుబు తదితర పరీక్షలు చేసి అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, ఎం.ప్రకాష్, కె.నెహెమ్యా పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు

పొక్లెయినర్, నాలుగు వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - నకరికల్లు

మట్టిని అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణకు వచ్చిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి నకరికల్లు మండలంలోని గుండ్లపల్లిలో తనిఖీలు చేపట్టగా మట్టిని అక్రమంగా తవ్వుతున్న రెండు పొక్లెయినర్లు, ఒక టిప్పరు, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని నకరికల్లు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రేషన్ కొనుగోలులో దళారుల దర్జా..!

ఎమ్‌డిఎం వాహనం వద్దే సేకరణ

ప్రజాశక్తి- అమరావతి

రేషన్ వాహనాల్లో కార్డుదార్లకు ఇచ్చిన బియ్యాన్ని పక్కనే మరో వాహనంపై కిలో రూ.10 చొప్పున కొందరు దళారులు కొనుగోలు చేస్తుండడం మండల కేంద్రమైన అమరావతిలో మంగళవారం తారసపడింది. ఇదే విధంగా మండలం మొత్తంగా సేకరించి వాటిని కిలో రూ.13 చొప్పున స్థానిక సిజెబి ఫౌల్ట్రీ ఫారానికి తరలిస్తున్నారు. దీనిపై దళారులను ప్రశ్నించగా అధికారులకు ఫౌల్ట్రీ ఫారం నిర్వాహకులు ప్రతినెలా ముడుపులు ఇస్తున్నారని, అడగడానికి మీరెవరని ఎదురు ప్రశ్నిస్తుండడం గమనార్హం.

ఎక్కడి నుండైనా పోటీ చేస్తా

అది చంద్రబాబు నిర్ణయం మీద ఆధారపడి ఉంటుంది : కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - బెల్లంకొండ, నకరికల్లు

వచ్చే ఎన్నికల్లో తాను ఎక్కడి నుండి పోటీ చేయాలో చంద్రబాబు నిర్ణయిస్తారని, ఆయన ఎక్కడి నుండి పోటీ చేయాలంటే అక్కడి నుండి పోటీకి తాను సిద్ధంగా ఉన్నానని మాజీ మంత్రి, టిడిపి నేత కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండకు మంగళవారం వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గానికి, ఇక్కడి ప్రజలకు ఏం కావాలో ఎమ్మెల్యే నంబూరు శంకర్రావుకు తెలుసా? అని మాజీ మంత్రి, టిడిపి నేత కన్నా లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ఎన్ని బ్రిడ్జిలు కావాలి? ఎన్ని సబ్‌స్టేషన్లు కావాలనేది తెలుసా? అన్నారు. దోచుకోవటం దాచుకోవడమే తప్ప ఇక్కడి ఎమ్మెల్యేకు మరొకటి తెలియదన్నారు. సచివాలయాలు, ఆర్‌బికెలు నిర్మిస్తే అభివృద్ధి కాదని, అచ్చంపేట మండలం వేల్పూరు లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిచేసే దమ్ముందా? అని వ్యాఖ్యానించారు. వైసిపి పాలనలో అక్రమ కేసులు, బెదిరింపులు మినహా అభివృద్ధి లేదని, క్వారీలు, ఇసుక దోచుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో తాను శ్రీధర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు. బహిరంగ చర్చలకు సిద్ధంగా ఉన్నామని అన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

ఇదిలా ఉండగా నకరికల్లు మండలం కుంకలగుంటలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను కన్నా లక్ష్మీనారాయణ పరిశీలించారు. బాధిత రైతులందర్నీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వనరులను తాకట్టు పెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా రూ.16 లక్షల కోట్ల అప్పులు చేస్తున్నారని మాజీ మంత్రి, టిడిపి నేత కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. సంక్షేమ పథకాలకు రూ.2 లక్షల కోట్లు ఖర్చుపెడితే మిగతా నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదాను కేంద్రం వద్ద జగన్ తాకట్టు పెట్టారని, కేసుల విషయంలోనే ఢిల్లీకి వెళ్లి వస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంట టిడిపి నాయకులు ఎన్.సౌరయ్య, కె.బాజీచౌదరి, షేక్ అలీబాష, సత్యనారాయణ చౌదరి ఉన్నారు.

న్యూటన్స్ కాలేజీలో ఘనంగా యాన్యువల్ డే

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల సమీపంలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో యాన్యువల్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డి, పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అవకాశాలను సాధించాలని ఉద్బోధించారు. అనంతరం క్యాంపస్ సెలక్షన్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ జగదీశ్వర్‌రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నూటన్స్ కాలేజీ కరస్పాండెంట్ జున్నా శ్రీనివాస్‌రెడ్డి

మృతిచెందిన కౌలురైతు కుటుంబానికి టిడిపి రూ.లక్ష సాయం

ప్రజాశక్తి పెదకూరపాడు

పిడుగుపడి మృతి చెందిన కౌలురైతు ఏనుగుల నరసింహారావు కుటుంబానికి రూ.లక్ష సాయాన్ని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సమకూర్చగా ఈ మొత్తాన్ని టిడిపి నాయకులు మంగళవారం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎ.రమేష్, బి.రామ్‌గోపాల్‌రావు, జి.బాబురావు, వి.అప్పారావు, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పి.అప్పారావు

బయోటెక్నాలజీ ఆఫ్ కైటిన్ అండ్ కైటో సాన్స్'పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 'బయోటెక్నాలజీ ఆఫ్ కైటిన్ అండ్ కైటో సాన్స్'పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పి.అప్పారావు కీలకోపన్యాసం చేశారు. కైటిన్ అనేది మొట్టమొదటిగా బెక్ నోట్ అనే శాస్త్రవేత్త ద్వారా పుట్టగొడుగులు, శిలీంద్రాల నుండి వేరు చేయబడినదని, ఇది రొయ్యల యొక్క బయట కవచంలో, ఆర్థ్రోపోడా పురుగుల బయట కవచంలో సమృద్ధిగా ఉంటుందని తెలిపారు. ఎన్‌ఎసి టైల్ గ్లూకోస్మైన్ అనే మోనోమెర్స్‌తో నిర్మితమై ఉంటుందని, కైటిన్‌లో ఉండే ఎన్. ఎ.సిటైల్ గ్లూకోస్మైన్ నుండి ఎసిటైల్ గ్రూపుని వేరు చేస్తే అది కీటోజాన్‌గా మారుతుందని, ఈ స్థితిలోనే కైటిన్ ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. శరీరానికి అయిన గాయాలను ఇన్ఫెక్షన్‌ల బారిన పడకుండా కైటిన్‌ను అతికిస్తారని, కైటిన్ ఆలిగో శాఖ రైట్స్ ఉత్పత్తి చేస్తారని, మొక్కలలో రోగ నిరోధక శక్తి పెంపొందించడానికి ఇది ఎంతగానో ప్రయోజనకరమని వివరించారు. మానవ శరీరంలో ప్రభావంతమైన మందులను ఎక్కించినప్పుడు వాటి వలన ఇతర అవయవవాలపై ఎలాంటి దుష్ప్రభావాలు పడకుండా ఇది అడ్డుకుంటుందని తెలిపారు. అనంతరం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ మాట్లాడారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, రెక్టార్ ప్రొఫెసర్ పి.వరప్రసాదమూర్తి, ఒఎస్‌డి ప్రొఫెసర్ కె.సునీత, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ గంగాధర్, ప్రొఫెసర్ సిద్దయ్య, ప్రొఫెసర్ ప్రమీలరాణి పాల్గొన్నారు.

తెనాలిని వదలని గం'జాయ్'

- నిత్యం వెలుగు చూస్తున్న కేసులు
- విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు
- కానరాని నిఘా.. నియంత్రణలు

పట్టుబడిన గంజాయి బస్తాలు, వెనుక వరుసలో నిందితులు, వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పీ(ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-తెనాలి

గంజాయి మహమ్మారి తెనాలి పట్టణాన్ని పట్టి పీడిస్తోంది. రోజురోజకూ ఈ వ్యాపారం వేళ్లూనుకుంటోంది. ఈజీ మనీ కోసం కొందరు చేస్తున్న వ్యాపారం, విద్యార్థులను సైతం బానిసలుగా మార్చేస్తోంది. దీంతో పట్టణంలో నిత్యం ఏదో ఒక మూల గంజాయి కేసులు పట్టుబడటం సర్వసాధారణంగా మారింది. ఏకంగా 15కిలోల గంజాయి బహిరంగంగా పట్టుబడటం పట్టణంలో చర్చనీయాంశమైంది. విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు జరుగుతున్నాయన్న విషయం పట్టణ ప్రజల్లో మరింత ఆందోళన రేకెత్తిస్తోంది.

తెనాలిలో గతంలో ఎన్నడూ లేని విధంగా గంజాయి విక్రేతలు పెరిగిపోతున్నారు. వ్యాపారం రోజురోజుకు మూడు పువ్వులు, ఆరు కాయలుగా వృద్ధి చెందుతోంది. గతంలో గంజాయి కేసులు వెతకబోతే కాలికి తగిలిన తీగలాగా ఎప్పుడో ఒక కేసు వెలుగుచూసేది. కాని ప్రస్తుతం ఆ పరిస్థితి దాటి పోయింది. ప్రస్తుతం పట్టణంలో గంజాయి అలికిడి లేని రోజే లేదు. దాదాపు నాలుగు నెలల క్రితం గంజాయి విక్రయిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వారంతా 18 నుంచి 22 సంవత్సరాలలోపువారే. విద్యార్థులై ఉండి కూడా ఈజీ మనీ కోసం ఇలాంటి వ్యాపారాలు చేస్తున్నారని పోలీసులు వెల్లడిస్తున్నారు. అలాగే రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ వ్యక్తి నుంచి ఇటీవల పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. నందులపేటలో ఇంటి ఆవరణలోనే గంజాయి పెంచి విక్రయించిన ఘటనపై పోలీసులు ఇటీవలి కాలంలోనే కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఐతానగర్ ప్యాడిసన్‌పేట కల్యాణ మండపం వద్ద ఇరువురు వ్యక్తుల నుంచి 15 కేజీల గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేసిన సమయంలో ఓ వ్యక్తి పారిపోగా, నందులపేటకు చెందిన ఐలా శ్రీనివాస్ అలియాస్ సాయిని అరెస్ట్ చేశారు. అతనితో పాటు మరో ఐదుగురు బృందాన్ని కూడా అరెస్ట్ చేశారు. వారంతా కూడా 20 నుంచి 22 సంవత్సరాల వయసులోపు వారే. అరెస్టు అయిన వారిలో ఇరువురు నందులపేటకు చెందినవారు కాగా, నలుగురు ఐతానగర్‌కు చెందిన వారని పోలీసులు వెల్లడించారు. ఐతానగర్‌లో పట్టుబడిన 15 కేజీల గంజాయి గోతాల్లో ఉండగా, దానిని 10 గ్రాములు, 20 గ్రాములు ప్యాకెట్టుగా చేసి, 10 గ్రాముల ధర రూ.200గా నిర్ణయించి విక్రయిస్తున్నారు. నర్సీపట్నం ప్రాంతం నుంచి కేజి రూ.500కు కొనుగోలు చేసి, వాటిని ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. తరచుగా పట్టణంలో గంజాయి కేసులు నమోదౌతున్నా పోలీసుల నిఘా కరువైందని, దాని ఫలితంగానే గంజాయి మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఏదైనా సమాచారం వస్తే మినహా, స్వతహాగా పోలీసుల నిఘా లేదు. పలుమార్లు పట్టుబడుతున్న గంజాయి విక్రేతల ద్వారా అసలు విక్రయాలు ఎక్కడెక్కడ జరుగుతున్నాయి, దానికి ఆధ్యులెవరన్నది తెలుసుకునే వీలుంది. ఆ దిశగా పోలీసుల చొరవలేదన్నది విమర్శగా మిగిలింది. చివరకు ఐతానగర్‌లో పట్టుబడిన 15కేజీల గంజాయి విషయం కూడా ఎవరో ఇచ్చిన రహస్య సమాచారంతోనే సాధ్యపడిందని సమాచారం.

అమ్మకాల కోసం తయారు చేసిన చిన్న ప్యాకెట్లు (ఫైల్ ఫొటో)

ఈ విక్రయాలు రోజురోజుకూ పెరిగిపోతుండటం తల్లిదండ్రుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. గుట్టు చప్పుడు కాకుండా చాపకింద నీరులా విస్తరించిన గంజాయి వ్యాపారం ఇప్పుడు పట్టపగలే పొట్లాలు కట్టి విక్రయించే స్థాయికి పెరిగిపోవటం, ఎక్కడో శివారు ప్రాంతాల్లో జరిగే తంతు పట్టణ నడిబొడ్డుకు చేరటం మరింత ఆందోళన కలిగించే అంశంగా మారింది. ముఖ్యంగా విద్యార్థులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు సాగుతున్నాయన్న దోరణి తల్లిదండ్రుల్లో తీవ్ర కలకలం సృష్టిస్తోంది.

చర్యలు తీసుకుంటాం: డిఎస్‌పి కె. స్రవంతి రాయ్

గంజాయి విక్రయాలు రోజు రోజుకూ వెలుగు చూస్తున్న నేపద్యంలో దాని కట్టడికి చర్యలు తీసుకుంటామని డిఎస్పీ కె.స్రవంతిరాయ్ చెబుతున్నారు. ఐతానగర్‌లో 15 కేజీల గంజాయి పట్టుబడటం, ఆకేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి వాటికి బానిసలైన వారిపై కూడా దృష్టి సారిస్తామని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యక్రలాపాలకు పాల్పడిన ఎవరినీ ఉపేక్షించేది లేదని తెలిపారు.

బడ్డీ కొట్టు అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి: తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్ 7వ వార్డుకు చెందిన కుందుర్తి కోటేశ్వరరావు తన జీవనోపాధికి బడ్డీకొట్టు కావాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు అర్జీ పెట్టారు. అర్జీని స్వీకరించిన లోకేష్ మంగళవారం బడ్డీ కొట్టు కోటేశ్వరరావుకు అందజేయాలని టిడిపి కార్యాలయానికి పంపించారు. అలాగే నులకపేట క్వారీ ప్రాంతానికి చెందిన కుర్రపాటి కొండయ్య కూడా లోకేష్‌కు అర్జీ పెట్టుకున్నారు. పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో మంగళవారం బడ్డీకొట్టుతో పాటు తోపుడుబండిని లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.రామకృష్ణారావు, కె.శివప్రసాద్‌రావు, ఎ.చెన్నయ్య, కె.ప్రసాద్, డి.దుర్గారావు, కె.యోగేశ్వరరావు, జాన్సన్, కొట్టె శ్రీను, చిన్న దుర్గారావు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

మాట్లాడుతున్న కె. అనూష

ప్రజాశక్తి- మంగళగిరి : బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ కె.అనూష అన్నారు. మంగళవారం పట్టణంలోని రత్నాల చెరువులోని 21వ వార్డులో గుడ్ షెఫర్డ్ కాన్వెంట్, హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో మెడిటేషన్ సెంటర్లో పేరెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ సిస్టం పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అనూష మాట్లాడుతూ బాలల జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు ఉన్నాయని అన్నారు. బడి ఈడి పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ లతా, ఎన్ నాగమణి, సౌజన్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిఎస్ఎఫ్ నాయకులు

అన్ని రంగాల్లో గిరిజనుల వెనుకబాటు

ప్రజాశక్తి-తాడేపల్లి

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడిచినా అన్ని రంగాల్లో వెనుకబాటులో గిరిజనులు మగ్గిపోతున్నారాని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్) జాతీయ అధ్యక్షులు ఎ.నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, వైద్యం, ఆరోగ్యం, ఆర్థికం, సామాజికంగా అన్నింటా గిరిజనులు వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల విధానాలే దీనికి కారణమని తెలిపారు. గిరిజన జాబితాలో ఇతర కులాలను చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఢిల్లీ కేంద్రంగా గిరిజనుల హక్కుల కోసం పోరాటం చేస్తామని తెలిపారు. గిరిజన హక్కులను కాలరాయాలని చూస్తే ఏ ప్రభుత్వమైనా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు చంద్రప్ప, కార్యదర్శి విష్ణు నాయక్, రాష్ట్ర ఉపాధ్యాయులు రవీంద్రనాయక్, విజయనాయక్, వెంకటేష్ నాయక్, జాన్‌వెస్లీ, భగవాన్, రఘునాధనాయక్, నరసింహదొర, మల్లేష్‌నాయక్ పాల్గొన్నారు.

విదార్థులకు వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక గుంటూరు పట్టణంలోని నగరపాలక సంస్థ పరిధిలోని పవర్‌పేటలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు బాబు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు, ప్రశంసా పత్రములు ప్రదానం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. కోటి సత్యనారాయణ మాట్లాడుతూ మహనీయుల జీవితం భావితరాలకు ఆదర్శమని చెప్పారు. గుంటూరు వార్డు సచివాలయ ప్రెసిడెంట్ గోలి ధనలక్ష్మి సామ్రాజ్యం మాట్లాడుతూ మహనీయుల జీవిత అధ్యయనం అవసరమని, జగ్జీవన్ రామ్ సామాజిక రాజకీయ జీవితాన్ని తెలియజేశారు. కార్యక్రమ నిర్వాహకులు డి.అనిల్ కుమార్ మాట్లాడుతూ వక్తృత్వం, వ్యాసరచన వంటి పోటీలు నిర్వహించడం వలన విద్యార్థులలో విషయ పరిజ్ఞానం, భావవ్యక్తీకరణ వంటి నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

చంద్ర శేఖరరావును సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

పౌరాణిక కళాకారుడు చంద్రశేఖరరావుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పెమ్మసాని థియేటర్ లో మంగళవారం ఎన్టీఆర్ నటించిన గుడిగంటలు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో రోజుకొక కళాకారుణ్ణి సన్మానించే కార్యక్రమంలో పట్టణ పౌరాణిక నాటక కళాకారుడు, గంగిశెట్టి చంద్రశేఖరరావును ఐటిడిపి నాయకులు మల్లవరపు విజయ్,షేక్ జాఫర్ సాధిక్, కె యోగేష్, పి రాజేష్, జెట్టి రేణుక తదితరులు సత్కరించి ఎన్టీఆర్ జ్ఞాపికను అందించారు. థియేటర్ కమిటీ సభ్యులు పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, గుమ్మడి ప్రసాద్, ఎన్టీఆర్ జగన్, ఎం రాఘవరావు, డి భాస్కర్, ఎం వెంకట్, ఎన్ శ్రీనివాస్, ఎస్ సాంబశివరావు తదితరులు పాల్గున్నారు.

గొడుగును అందజేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి- మంగళగిరి

పట్టణంలో వీధి వ్యాపారం చేసుకునే పేదలకు వేసవికాలంలో ఎండను తట్టుకునే విధంగా ఉండేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం అరవింద స్కూల్ గ్రౌండ్ ఆవరణలో గొడుగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు వి.రవి, ఉపాధ్యక్షులు రామచంద్ర రాజు, ఏ.రత్న ప్రభాకర్, మంగళగిరి సబ్ బ్రాంచ్ చైర్మన్ ఇసునూరి చక్రవర్తి, కార్యదర్శి షేక్ సిలార్, సభ్యులు జి. శ్రీనివాసరావు, కే.రూపస్, అందే మురళి, ఏ.రేవంత్, ఆర్.రమేష్, వి.శ్రీనివాసరావు,ఎన్.వెంకటేశ్వరరావు, కే.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎంపిపి డి. సంతోష రూపవాణి

బాధితురాలికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-దుగ్గిరాల

అనారోగ్యంతో బాధపడుతున్న పేద మహిళకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పిటిసి మేకతోటి అరుణ, యార్డ్ చైర్మన్ షేక్ బాజీల చేతుల మీదుగా అందజేశారు. మంగళవారం స్థానిక దళితవాడకు చెందిన కొండపల్లి ఏరియాకు రూ.10వేలను బూసి కపమ్మకు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కంభంపాటి క్రాంతి కుమార్ వెంకటేశ్వర నాయక్ గాలం ఫనింద్ర, కె.సలోమి, కె. కర్న్యా రావు తదితరులు పాల్గొన్నారు.

ఐఐఎస్‌సితో విజ్ఞాన్ అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక విద్యాసంస్థలు నిర్వహిస్తున్న విజ్ఞాన్ గ్రూప్ (లావు ఎడ్యుకేషనల్ సొసైటీ) బెంగుళూరులోని ఐఐఎస్‌సీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందానికి సంబంధించిన పత్రాలను విజ్ఞాన్ గ్రూప్ వైజాగ్ సీఈవో నందిగం శ్రీకాంత్‌కు ఐఐఎస్‌సీ బెంగళూరు రిజిస్ట్రార్ శ్రీధర్ వారియర్ అందజేశారు. ఈ సందర్భంగా నందిగం శ్రీకాంత్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలోని విద్యాసంస్థలతో కాకుండా వెలుపలి రాష్ట్రాలలోని ప్రైవేటు ఈ అవగాహన ఒప్పందం వలన ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లోని విజ్ఞాన్ విద్యార్థులకు సైన్స్‌తో పాటు మ్యాథమేటిక్స్ సబ్జెక్టులను సులభంగా బోధించడంతో పాటు, భోధనా నాణ్యతను మరింత పెంచి ప్రయోగాత్మక అభ్యసనం అందించటానికి ఉపయోగపడుతుందన్నారు.ఐఐఎస్‌సీ బెంగుళూరుతో అవగాహన ఒప్పందం కుదుర్చోకోవడం పట్ల విజ్ఞాన్ గ్రూప్ ప్రిన్సిపల్స్, అధ్యాపక సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఐఐఎస్‌సీ, విజ్ఞాన్ ప్రతినిధులు

సావిత్రిబాయి పూలే విగ్రహం నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరం, నడిబొడ్డున ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహం నిర్మించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. ఈమేరకు సంఘం నాయకులు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేసన శంకరరావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళా విద్య కోసం ఎన్నో త్యాగాలను ఓర్చుకొని పనిచేశారన్నారు. జ్యోతిరావుపూలేతో పాటు, సావిత్రిబాయి పూలే విగ్రహం ఏర్పాటు చేయటం వల్ల ఆమెకు సముచిత స్థానం కల్పించినట్లు అవుతుందన్నారు. కావున విగ్రహంతోపాటు, మంచి ఫౌంటైన్, సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఈనెల 11న జరిగే పూలే జయంతిరోజు ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా అక్కడ ఉండే సెంటర్‌కి సావిత్రిబాయి పూలే సెంటర్ అని నామకరణం చేయాలని, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన నాయకులు

మొగల్ చక్రవర్తుల పాఠ్యాంశాన్ని పునరుద్ధరించాలని కోరుతున్న జమీల్ అహ్మద్ బేగ్ తదితరులు

మొగల్ చక్రవర్తుల పాఠ్యాంశాన్ని పునరుద్ధరించండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మొగల్ చక్రవర్తుల పాలన పాఠ్యాంశాన్ని తరగతి పుస్తకం నుంచి తొలగించడం అన్యాయమని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ చైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ అన్నారు. గుంటూరు లాలాపేటలోని షాహి జామియా మసీదు (పెద్ద మసీదు) ప్రాంతంలో మహబూబ్ సుబాని జెండా చెట్టు వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొగల్ చక్రవర్తుల భారత దేశాన్ని 1526 నుంచి 1707 వరకు పాలించారు. వీరిలో బాబర్, హుమాయూన్, అక్బర్, జహంగీర్, షాజహాన్, ఔరంగజేబు వంటి వారు భారత దేశాన్ని పాలించారు. వారి కాలంలో దేశం సుభిక్షంగాను, సుఖసంతోషాలతో జీవించారని, వారి కాలంలో ఎన్నో చారిత్రక కట్టడాలను నిర్మించారన్నారు. ఆ కోవలోవే ఆగ్రా కోట, తాజ్‌మహల్, ఎర్రకోట వంటి చారిత్రత కట్టడాలను నేటికీ మనం చూస్తున్నాం. దేశ ప్రధాని ఎర్రకోటపై దేశ జెండాను ఎగురవేయడం గర్వకారణంగా భావిస్తున్నాం. భావితరాలకు వారియొక్క చరిత్ర గుర్తుండాల్సిన అవసరం ఎంత్కైనా ఉంది. వారు నిర్మించిన చారిత్రక కట్టడాలను పదిలపరచుకుంటున్నాం గాని తొలగించం.. అటువంటిది కేంద్ర ప్రభుత్వం మొగలుల చరిత్ర పాఠ్యాంశాన్ని తొలగించడం అన్యాయమని, రాష్ట్రంలోని పాలకపక్షంతోపాటు ప్రతిపక్ష పార్టీలు సైతం పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశంపై చర్చ లేవనెత్తి మైనార్టీలకు న్యాయం జరిగేలా పోరాడాలని జమీల్ అహ్మద్ బేగ్ కోరారు. ఆయన వెంట షఫీ బేగ్, రఫీ బేగ్, రియాజ్ బేగ్, హాజీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు పథకంతో భూములకు రక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

భూ యాజమాన్య హక్కులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించటానికే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా భూముల రీ సర్వేకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్‌చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలంలోని గారపాడులో శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం మీ భూమి మా హామీలో భాగంగా జరుగుతున్న భూముల రీసర్వేకి సంబంధించి రైతులు, రెవెన్యూ, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఎంవీఎస్ నాగిరెడ్డి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జెసి రాజకుమారితో కలసి పాల్గొన్నారు.తొలుత వారు భూముల రీసర్వేకి సంబంధించి వినియోగిస్తున్న అత్యాధునిక పరికరాలు, గ్రామంలో రీసర్వే జరిగిన తీరుపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో జరిగిన సభలో నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 67 శాతం మంది సగటున ఎకరం ఐదు సెంట్లు, 20 శాతం మంది మూడు ఎకరాలులోపు భూమి కలిగి ఉన్నారన్నారు. వందేళ్ల క్రితం బ్రిటీష్ కాలంలో భూముల సర్వే జరిగిందని, దేశంలోనే తొలిసారిగా సిఎం జగన్ మోహన్‌రెడ్డి భూ యజమానుల హక్కుల పరిరక్షణకు ఎంతో సాహసంతో భూముల రీసర్వే ప్రారంభించారన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోవర్ లాంటి ఖరీదైన పరికరాలతో శాటిలైట్ లింకు ద్వారా భూములు హద్దులు ఖచ్చితంగా నిర్ణయించి భూ యజమానులు ప్రపంచంలో ఎక్కడ నుంచైన భూమి హద్దులు తెలుసుకునేలా క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ భూ హక్కు పత్రాలను అందించటం జరుగుతుందన్నారు. భూ యజమానులు కూడా కూడ తమ వారసులకు భూములపై చట్టపరమైన హక్కులు కల్పించటానికి పార్టీషన్, గిఫ్ట్, తదితర భూ బదలాయింపులను ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ చేయించు కోవాలన్నారు. మేకతోటి సుచరిత మాట్లాడుతూ రీసర్వేకి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జెసి మాట్లాడుతూ రీసర్వేలోని అన్ని ప్రక్రియల్లో యజమానులను భాగస్వాములుగా కొనసాగిస్తున్నామన్నారు. సీఆర్డీఏ పరిధిలోనివి, మున్సిపాల్టీలలో విలీనమైన గ్రామాలు మినహా మిగిలిన 173 గ్రామాల్లోని దాదాపు 4,70,000 ఎకరాల భూమిని రీ సర్వే చేయటం జరుగుతుందన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉన్న భూమి కొలతలకు, రికార్డులో ఉన్న భూమి కొలతలకు తేడా ఉందని, వివిధ కారణాలతో కొన్ని భూములు రికార్డుల్లో నమోదు కాలేదని కొందరు భూ యజమానులు తెలపగా పరిశీలించి సమస్య పరిష్కారంకు చర్యలు తీసుకుంటామని జెసి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు నల్లమోతు శివరామకృష్ణ, రైతు విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నరసింహారావు, ఏపి అగ్రిమిషన్ టెక్నికల్ సెక్రటరీ పి రామ శ్రీధర్ రెడ్డి, ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, సర్వే,ల్యాండ్ రికార్డ్సు ఏడీ రూప్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పరికరాలను పరిశీలిస్తున్న నాగిరెడి, జెసి తదితరులు

మలినేనిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

వట్టిచెరుకూరు మండలం, పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజీలో హెల్ప్ ఫౌండేషన్ (సత్తనపల్లి) (నెహ్రూ యువ కేంద్రం గుంటూరు అనుబంధ సంస్థ), కామాక్షి ఐకేర్ (చెరుకుపల్లి) సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవిరెడ్డి శ్రీనివాస్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి యువత సామాజిక మాధ్యమాలపై అధిక సమయం గడపడం వలన కంటి సమస్యలు ఎక్కువ అయ్యాయని, విపరీతంగా ల్యాప్‌టాప్ ఫోన్‌లకు అలవాటు పడటం వలన కంటి సమస్యలు అందర్నీ ఇబ్బంది పెడుతున్నాయన్నారు. వైద్యులు వాసుదేవరావు మాట్లాడుతూ సాధారణంగా చాలామంది దష్టిలోపాలు ఉన్నా కూడా చిన్న సమస్యే కదా అని, దాని పట్ల శ్రద్ధ వహించకుండా వదిలేస్తూ ఉంటారని, ప్రతి ఒక్కరూ కంటి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, కాలేజీ ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి షేక్ జిలానీ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నాగార్జునసాగర్‌లో ఉస్తాద్ సినిమా చిత్రీకరణ

ప్రజాశక్తి - విజయపురి సౌత్

ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి రెండవ కుమారుడు శ్రీ సింహా కోడూరి హీరోగా ఉస్తాద్ సినిమా షూటింగ్ ఫ్లైట్ సీన్ నాగార్జున సాగర్, విజయపురిసౌత్ లో మంగళవారం జరిగింది. శ్రీ సింహా కోడూరి మత్తు వదలరా, తెల్లవారితే గురువారం వంటి సినిమాల్లో నటించి హీరోగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమాలో హీరో సరసన బలగం ఫేమ్ కావ్య కళ్యాణ్ రామ్ హీరోయిన్‌గా నటిస్తుంది. బైకు నేపధ్యంలో సాగే ఈ సినిమాలో హీరో ఫైలట్‌గా ఎలా అవుతాడన్నదే కధాంశం. ఫణిదీప్ తోట డైరెక్షన్‌లో ప్రొడ్యూసర్ రజనీ కొర్రపాటి, రాకేష్ గడ్డం, హిమాన్క్ దువ్వూరు ఆధ్వర్యంలో సినిమా రూపుదుద్దుకుంటుంది. మంగళవారంతో సినిమా చిత్రీకరణ మొత్తం పూర్తయిందని, గత సంవత్సరం ఆగస్ట్ నెలలో ప్రారంభమైన ఈ సినిమాను ఈ ఏడాది జూన్ , జులై నెలలో విడుదల చేస్తామని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు.

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్

వార్డు వాలంటీర్ల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీర్ల పోస్టుల భర్తీకి కమిషనర్ ఆదేశాలతో మంగళవారం డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్ల పోస్టులకు ఆన్‌లైన్ ద్వారా 381 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో కొందరికి సరైన ధ్రువపత్రాలు లేనందున వారి దరఖాస్తులు తిరస్కరించటం జరిగిందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన అనంతరం 298 మందిని అర్హులుగా ప్రకటించగా వారిలో 170 మంది ఇంటర్వ్యూకి హాజరయ్యారన్నారు. వాలంటీర్లుగా ఎంపికైన వారి ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, వారు ఈనెల 6 నుండి విధుల్లోకి చేరాల్సి ఉంటుందని తెలియజేశారు.